# విదేశీ పెట్టుబడి గురించి.... కామ్రేడ్ టి.ఎన్.

విశ్వం



*కా॥ తరిమెల నాగిరెడ్డి శతజయంతి సందర్భంగా ఆయన జీవితాన్ని, రాజకీయాలను ప్రజల ముందు ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా టి.ఎన్. మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన పుస్తకాలలో ఒకటైన 'కమ్యూనిస్టు విప్లవకారుడు, దేశభక్తుడు – పీడిత ప్రజల నాయకుడు తరిమెల నాగిరెడ్డి జీవితము – రాజకీయాలు' అన్న పుస్తకం నుండి 'విదేశీ పెట్టుబడి గురించి....' అధ్యాయాన్ని అందిస్తున్నాం.*
*– సంపాదకుడు*

**భారతదేశంలో** విదేశీ ప్రైవేటు పెట్టుబడి గట్లు తెగిన వరదలా ఎలా ప్రవహిస్తోందో, ఈ ప్రవాహం అంతిమంగా ఏ వర్గాల ప్రయోజనాలను తీవ్రస్థాయిలో దెబ్బకొడుతుందో, ఏ వర్గ ప్రయోజనాలను కాపాడటానికి ఈ విదేశీ ప్రైవేటు పెట్టుబడి ఉపయోగపడుతుందో కా॥ టి.ఎన్. సోదాహరణంగా వివరించాడు. కా॥ లెనిన్ చెప్పినట్లు వలస రాజ్యాలుగా ఇంకేమాత్రము కొనసాగించలేని పరిస్థితుల్లో విదేశీ పెట్టుబడులు, విదేశీ సహాయాలు ఆయా దేశాలను నియంత్రణలో ఉంచుకోవ డానికి ఒకానొక ప్రధాన సాధనంగా సామ్రాజ్యవాద దేశాలు ఉపయోగించుకొంటాయన్న విశ్లేషణను భారతదేశానికి అన్వయిస్తూ టి.ఎన్. చేసిన ప్రసంగం, ఈ దేశపు వెన్నెముకలేని దళారీ పాలకుల యొక్క దుష్ట బుద్ధిని, ప్రజల పట్ల బాధ్యతారహిత వైఖరులను తేటతెల్లం చేసింది.

భారతదేశంలోని పరిశ్రమలపై విదేశీ నియంత్రణను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని, అందుకనుగుణంగానే స్వదేశీ పరిశ్రమల్లో విదేశీయుల వాటాలు 49శాతానికి మించి అనుమతించేది లేదని, విదేశీ శక్తుల నియంత్రణకు షేర్లను 49 శాతానికి మాత్రమే పరిమితం చేశామని, ఈ పాలకులు 'సోషలిస్టు' కబుర్లు చెపుతున్నారని టి.ఎన్. చెప్పారు. అయితే ఆచరణలో ఈ 49 శాతం షేర్లతో భారతదేశ కంపెనీలలో నిర్ణయాత్మక పాత్రగా మాత్రమే కాక పూర్తి ఆధీన స్థానాలుగా మార్చుకోగలిగే శక్తి సామర్థ్యాలు సామ్రాజ్యవాద శక్తులకు పుష్కలంగా ఉంటాయని టి.ఎన్. ఆధారాలతో నిరూపించాడు. దీని కోసం ఆయన 25శాతం షేర్లు వున్న వారికి వీటోపవర్ అధికారాన్ని, 49 షేర్లు విదేశాల చేతిలో కేంద్రీకృతం అయి వున్న తీరూ, 51 శాతం షేర్లు వేలాదిమంది భాగస్వాముల విడివిడి షేర్లు ఉండటాన్ని వివరిస్తూ ఈ దోపిడీ పాలకుల అర్థశాస్త్ర గారడీ గుట్టువిప్పి నిండు న్యాయస్థానంలో ఈ దేశ పాలకులను దేశద్రోహులని నిరూపించారు.

విదేశీ కంపెనీలతో మిలాఖత్ ఒప్పందాలను ఈ పాలకులు ప్రోత్సహిస్తున్నారు. చీరల ఉత్పత్తి నుంచి, పాము వంటి గొలుసుల ఉత్పత్తివరకు, ఒకటనేమిటి సమస్త రంగాలలో మిలాఖత్ ఒప్పందాలను ఈ పాలకులు ప్రోత్సహిస్తూ వచ్చిన తీరును కా॥ టి.ఎన్. ఆధార సహితంగా నిరూపించారు. దీని కోసం ఆయన విస్తృత అధ్యయనాన్ని ఎంచుకొన్నారు.

మిలాఖత్ కోసం విదేశీ కంపెనీలు ఎందుకు ఉత్సాహం చూపుతున్నాయో కూడా టి.ఎన్. వివరించారు. స్వదేశీ రాయితీలను అనుభవించడానికి, ఆయా దేశాలలో కొన్ని పారిశ్రామిక కుటుంబాలకున్న పేరు, ప్రతిష్టలను, కీలకమైన ప్రభుత్వ సంస్థలతో ఆయా కుటుంబాలకున్న సాన్నిహిత్యం, ఈ విదేశీ కంపెనీలకు మరింతగా లాభాలను గ్యారంటీ చేస్తాయి. మరోవైపు 'విదేశీ' గ్లామర్‌ను అడ్డదం, మన భారతదేశ మధ్య తరగతి ప్రజానీకానికి వస్తు వినిమయలోలత్వం అలవాటుచేయడం ద్వారా లాభాలను మరింతగా తరలించవచ్చని, ఉభయ తారకంగా వున్న ఈ మంత్రాంగంలో అంతిమంగా నష్టపోయేది ఈ దేశపు కోట్లాది పీడిత ప్రజానీకమే అని, వీళ్ళకు అంతులేని ఈ ద్రోహం చేస్తున్నది ఈ దేశపు దళారీ పాలకులే అన్నది టి.ఎన్. స్పష్టంగా ప్రకటించారు.

ఈ మిలాఖత్ కంపెనీలలో పెట్టిన పెట్టుబడికి అనేకరెట్ల సంపదను తరలించుకుపోతున్న సామ్రాజ్యవాద దేశాలు ఆయా కంపెనీలలో ఉన్నతాధికార వర్గానికి జీతాల చెల్లింపు పేరుతో అపారమైన సంపదను తరలిస్తున్నారు. ఈ తరలిపోతున్న సంపదపై కనీసం ఆదాయం పన్ను కూడా వేయకుండా ఈ దేశపు దోపిడీ పాలకవర్గాలు వాళ్ళ సంపదల తరలింపును సురక్షితంగా కాపాడుతున్నారు. ఆయిల్ కంపెనీలలో సైతం విదేశీ పెట్టుబడుల ఉక్కుకౌగిలిని టి.ఎన్. నిరూపిస్తూ ఆయా కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను కోర్టులో స్పష్టీకరించారు. ఆరుగాలం కష్టపడుతున్న ఈ దేశపు వ్యవసాయకూలికి, యంత్రభూతముల కోరలు తోమే ఈ దేశపు కార్మికవీరులకు ముదుతున్న కూలీ, వాళ్ళ అవసరాలకు ఏమాత్రం చాలని పరిస్థితుల్లో అర్థాకలితో ఆయా కంపెనీలకు మూలస్థంభాలుగా నిలబడి వున్నవేళ, ఆయా మేనేజింగ్ డైరెక్టర్లకు 1970 సం॥లో నెలకు 27 వేలు చెల్లించడాన్ని టి.ఎన్. విశదీకరిస్తూ ఈ దుర్మార్గమైన దోపిడీ విధానాలను ప్రోత్సహిస్తున్న ఈ పరిపాలనావర్గాన్ని శిక్షించే దమ్ము ఈ న్యాయస్థానాల కుందని ఆశించగలమా అని సూటిగా ప్రశ్నించారు. భారతదేశంలో వున్న యూనియన్ కార్బైడ్ కంపెనీ ప్రత్యక్షంగా అమెరికన్ యాజమాన్యం క్రింద నడపబడు తోందని వివరిస్తూ ఆ మేనేజింగ్ డైరెక్టర్‌కు 3.40 లక్షల రూపాయలు సం॥కి చెల్లించబడటం, ఏ దేశభక్తులు చేస్తున్న పని అని ఆయన

మహాగ్రహంగా ప్రశ్నించారు. ఆతర్వాత పది సంవత్సరాలకి ఆ యూనియన్ కార్బైడ్ ధనదాహానికి ఈ దేశపు అభాగ్యజీవులు 2 వేల మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగింది. ఈ దేశంలో మిలాఖత్ కంపెనీలలో పెట్టుబడుల యొక్క దుర్మార్గమైన వ్యూహానికి, సామ్రాజ్యవాదుల ధనపిపాసకు, మానవ ప్రాణాల పట్ల విలువలేని అత్యంత నిర్లక్ష్యవైఖరులకు ఈ ఘటన అద్దం పడుతుంది.

భారతదేశం నుంచి బహుముఖ విధాలుగా తరలిపోతున్న సంపదకు ఖరీదుకట్టే షరాబేలేదని, జాతీయ వాంఛలుగల ఏ మేధావివర్గంకానీ, వామపక్షాలుగా చెప్పు కొంటున్న సి.పి.ఐ., సి.పి.యం. పార్టీలుగానీ ఆదిశగా ప్రయత్నాలు చేయటంలేదని, ఇవన్నీ కూడా ప్రజల్ని పీకల లోతు విద్రోహపు ఊబిలో కూరివేయడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాయని టి.ఎన్. నిర్ద్వంద్వంగా చెప్పాడు. విదేశీ వాణిజ్యంలో లోటు తీవ్రంగా పెరగడానికి ఎగుమతులు తగినంతగా పెరగకపోవడమే కారణం అని నాటి నుంచి నేటి వరకూ చేస్తున్న వాదనల్లోని మోసకారి స్వభావాన్ని టి.ఎన్. బదాబదలు చేశాడు. తాము కుదుర్చుకున్న మిలాఖత్ ఒప్పందాలలో భాగస్వామి అయిన విదేశీ సామ్రాజ్యవాద శక్తుల ఆజ్ఞలమేరకే తలలు ఊపుతున్న ఈ పాలకులు, వాళ్ళు విధించిన ఆంక్షలమేరకు దిగుమతులకు అత్యంత ఎక్కువ ఖరీదు చెల్లిస్తున్నారు. సామ్రాజ్యవాదులు చేస్తున్న దేశాలకు మాత్రమే ఎగుమతులను కూడా పరిమితం చేస్తూ వస్తున్నారు. నాగిరెడ్డి దీనికి ఒక ఉదాహరణగా "సైకిళ్ళ పరిశ్రమ నిర్ణయించుకొన్న ఎగుమతి లక్ష్యాలను సాధిండంలో విఫలమైంది. విదేశీ సంస్థ అయిన ర్యాలీ కంపెనీ ఆ దేశంలోని సైకిళ్ళ ఉత్పత్తి సంస్థలతో చేసుకున్న మిలాఖత్ ఒప్పందాలలో కొన్ని షరతులను విధించింది. తన పేటెంట్ల క్రింద తయారైన ఉత్పత్తులు రెండు లేక మూడు దేశాలకు మినహా ఇంకే దేశానికి ఎగుమతి చేయరాదని విధించిన షరతే ఈ వైఫల్యానికి కారణం" అని 1962లో చెప్పారు. ఇలాంటి విషమ షరతుల మధ్య భారతదేశంలో సర్వస్వతంత్రత, స్వావలంబన సాధిస్తామని చెబుతున్న ఈ పాలకుల దివాళాకోరు స్వభావాన్ని న్యాయస్థానంలో ఎత్తిచూపిన నాగిరెడ్డి, ఈ ప్రభుత్వం దృష్టిలో "కుట్రదారు" కాక ఇంకేం అవుతాడు.

జైన్ డైరీ వెలువడిన తర్వాతనే హవాలా కుంభకోణం ఈ దేశంలో జరిగినట్లుగానూ, దేశంలో అతిపెద్ద తలకాయలు ఇందులో కూరుకుపోయినట్లుగానూ, ఈ కుంభకోణం వెలికితీతలో అత్యంత నిజాయితీగా ఈ దేశపు నేరపరిశోధకులు వ్యవహరించినట్లుగానూ ఈ దేశపు అర్థశాస్త్రవేత్తలు, అధికారగణం తీవ్రంగా ప్రచారం చేశారు. అయితే కామ్రేడ్ టి.ఎన్. ఈ విషయాన్ని ఎంతో స్పష్టంగా ఇన్‌వాయిస్‌లను రకరకాల పద్ధతుల్లో హెచ్చించడం, తగ్గించడం ద్వారా ఏటా విదేశాలకు తరలిపోతున్న సంపదలో ఇక్కడి బడాబూర్జువా, దళారీ, అధికారగణం యొక్క పాత్రను విశదం చేశారు. ఆయన కోర్టు స్టేట్‌మెంట్‌లో "దురదృష్టవశాత్తు ఈ విధంగా వస్తున్న నష్టం గురించి సరిగా ప్రచురించడంలేదు" అని ప్రకటిస్తూ, ఈ అధికారగణం, దోపిడీపాలకుల నిజాయితీరాహిత్యాన్ని బట్టబయలుచేశారు. కామ్రేడ్ టి.ఎన్. స్వయంగా ప్రకటించినట్లు "మన జాతీయ స్వావలంబన, సర్వస్వతంత్ర ప్రభుత్వం యొక్క దేశభక్తియుత ఉద్దేశ్యాలను ఎవరైనా ప్రశ్నించ సాహసించారంటే వారిని దేశద్రోహ కార్యకలాపాల క్రింద అరెస్ట్‌చేసి కోర్టులలో విచారించి, ఈ గరీబీ హటావో ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి చేస్తున్న ప్రమాదకరమైన వారి కుట్రను మొగ్గలో తుంచివేస్తారు". సరిగ్గా టి.ఎన్. చెప్పినట్లే ఆనాటినుంచీ ప్రజావిప్లవకారులపై ఈ ఫాసిస్టు ప్రభుత్వం వివిధ పేర్లుతో కుట్రకేసులు పెట్టడానికి తెగబడుతూనే వుంది.

భారత పారిశ్రామిక రంగం ఉరుకులు, పరుగులతో సోషలిజం వైపు పురోగమిస్తోందని, దీనికి నిదర్శనంగానే కీలకరంగాలలో ప్రభుత్వరంగం అభివృద్ధిచెందుతోందని, ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాల రూపకల్పనలో సోవియట్ రష్యా మనకు ఆదర్శంగా వుందని–దీనికంతా కారకుడు నెహ్రూ అని జాతీయంగా రివిజనిస్టు గుంపు, అంతర్జాతీయంగా వీళ్ళను అదుపాజ్ఞల్లో వుంచే సోవియట్ ప్రచార రివిజనిస్టులు సంరంభాలతో పీడిత ప్రజానీకాన్ని మోసం చేస్తున్నారని కామ్రేడ్ టి.ఎన్. స్పష్టంగా చెప్పారు. కారల్ మార్క్స్ చెప్పినట్లే "ప్రభుత్వం ఎంత ఎక్కువగా ఉత్పత్తి శక్తులను తన యజమాన్యం క్రిందకు తీసుకు వస్తుందో, అంతగా ఆ ప్రభుత్వం పెట్టుబడిదారులందరి యొక్క నిజమైన సమష్టిసంస్థగా తయారై మరింత మంది పౌరులను దోపిడీచేస్తుంది". ఇండియాలో పెట్టుబడిదారుల, విదేశీ మిలాఖత్‌దారుల ఒప్పందాలను మరింత పరిపుష్టం చేయడానికి ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమలు దోహదం చేస్తున్నాయి తప్ప, ఈ దేశపు పీడితవర్గానికేమీ ఒరిగేది లేదని టి.ఎన్. సూటిగా చెప్పారు. అంతేకాక అమెరికన్ రాయబారిగా భారతదేశంలో పనిచేసిన గాల్‌బ్రత్‌ను ఉటంకిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడిదారీ దేశం అయిన అమెరికాలో మన కంటే ఎక్కువశాతమే పబ్లిక్‌రంగం ఉందని నిరూపిస్తూ, ఇలాంటి పబ్లిక్‌రంగ సంస్థలు సోషలిజంవైపు వేసే అడుగులు, అవి చేస్తున్న బూటకపు ప్రచారాలను టి.ఎన్. త్రిప్పికొట్టారు.

పబ్లిక్ రంగంలో పెరుగుదల, పబ్లిక్ రంగం పెరుగుదలకోసం నెహ్రూ తీసుకున్న చర్యలు గురించి విస్తృతమైన, మోసపూరితమైన సమర్థనల్లో బూటకత్వాన్ని సైతం టి.ఎన్. ఎండగట్టాడు. 1948, 1956 పారిశ్రామిక విధాన తీర్మానాలనుదహరిస్తూ నెహ్రూను పొగడ్తలలో ముంచెత్తుతున్న వాళ్ళ వైఖరులలోని మోసాన్ని ఎండ గడుతూ '1948', '1956' పారిశ్రామిక తీర్మానాలను ఆచరణలో ఎలా తుంగలో తొక్కారో శక్తిమంతమైన ఉదాహరణల ద్వారా నిరూపించారు.

కీలక పరిశ్రమలలో ఒక్కటైన 'బొగ్గు'ను షెడ్యూల్ ఎ (అంటే ప్రభుత్వ రంగానికే పరిమితమైన జాబితా)లో ఉన్నప్పటికీ ప్రైవేటురంగాల ఆక్టోపస్ విస్తరణకు అనుమతినిచ్చామని సాక్షాత్తూ పార్లమెంట్ అంచనాల సంఘమే పేర్కొనడాన్ని టి.ఎన్. ఉదహరిస్తూ, ఈ తీర్మానాలలో గుట్టును ప్రజలకు ఎరుకపరిచాడు. పార్లమెంట్ లైబ్రరీలలో అందంగా కట్టలు కట్టి ఉంచాల్సిన నివేదికలోని అంశాలను ప్రజలకు బోధించాలని నిర్ణయించుకొన్నందుకే టి.ఎన్. ఈ దోపిడీ పాలకవర్గాల దృష్టిలో కుట్రదారుడు అయ్యాడని అనుకోకుండా ఉండగలమా? ఆనాడు టి.ఎన్. చెప్పినట్లుగానే నేడు దేశంలో వందలాది బొగ్గుగనుల్లో బడా దళారీ బూర్జువావర్గం తిష్టవేయడాన్ని మనం స్పష్టంగా చూడగల్గుతున్నాం. మరో కీలక పరిశ్రమ చమురు రంగంలో సైతం షెడ్యూల్ ఎ నిబంధనలను ఉల్లంఘించి విదేశీ కంపెనీలలో మిలాఖత్ ఒప్పందాలను కుదుర్చుకొన్న వైనాన్ని, ఆయిల్ ఇండియా లిమిటెడ్ కంపెనీని బర్మా, భారత్‌లు చెరిసగం

పెట్టుబడితో నడపాలని నిర్ణయించడం అనే ఉదాహరణ ద్వారా టి.ఎన్. బట్టబయలు చేశారు. ఇది అంతిమంగా విదేశీ కంపెనీల భల్లూకపు పట్టు ఆయిల్‌రంగంలో పెరగడానికే దోహదపడుతుందని కా(మేడ్ టి.ఎన్. హెచ్చరించాడు. టి.ఎన్. హెచ్చరికకకు పరాకాష్ఠగానే 'రవ్వ' ఆయిల్ బేస్‌ను ఓ.ఎన్.జి.సి. తన స్వంత పరిజ్ఞానంతో కనుగొన్న గల్గినా నేడు దాని లాభాలు దేశంలోని బడాదళారీ బూర్జువా, విదేశీ కంపెనీల సంయుక్త కమాండ్‌కు అమ్మి వేయడంగా మనం చూడగలం. కీలకరంగాలలో భారత దేశాన్ని పరాధీనతలోకి, తాకట్టులోకి నెడుతున్న ఈ దోపిడీ పాలకుల నగ్నరూపాన్ని ఎక్స్‌పోజ్ చేసిన నేరమే దేశద్రోహమా?

నేడు భారత పాలకులు ఉవ్వెత్తున, శివాలెత్తినట్లు ప్రభుత్వ రంగం నష్టాలలో కూరుకుపోయిందని, దీనికి కారణం కార్మికుల క్రమశిక్షణారాహిత్యమే అని సంఘటిత కార్మికోద్యమం దేశంలో ప్రభుత్వరంగం పరిశ్రమల అభివృద్ధికి ప్రధాన అవరోధమని, కార్మికులంతా పనిదొంగలని ప్రచారం చేస్తున్నారు. కాని టి.ఎన్. ఆనాడే ఈ దేశ భవిష్యత్ నిర్ణేతలుగా అభివర్ణించు కొంటున్న దళారీ పాలకులు, తాము అతి గొప్పగా చెప్తున్న ప్రభుత్వరంగ పరిశ్రమలకు విద్రోహం చేస్తూ ప్రైవేటు రంగానికి చౌకయిన దోపిడీ వనరుగా ప్రభుత్వ రంగ సంస్థలను ఎట్లా ఉంచుతున్నారో సోదాహరణంగా వివరించారు. ఈ దేశపు బడా దళారీ బూర్జువా కంపెనీ అయిన బిర్లా కంపెనీ అమెరికన్ నిధులతో నడుపుతున్న హిందూస్థాన్ అల్యూమినియం కంపెనీ యొక్క అభివృద్ధికి ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు బలైపోయింది. రాయితీల రూపేణా ఏటా 2.5 నుంచి 3 కోట్లు ఈ కంపెనీ విద్యుత్ బోర్డు నిధుల నుంచి మ్రింగివేస్తూ విద్యుత్ బోర్డును ఎముకల పోగులా మిగుల్చుతోందని టి.ఎన్. పేర్కొన్నాడు. దీనికోసం ఆయన ఆ రాష్ట్ర విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శాసనసభలో చేసిన ప్రకటననే ఆధారం చేసుకొన్నాడు.

మరో ప్రభుత్వ రంగం సంస్థ ఐ.డి.పి.ఎల్. బల్క్ డ్రగ్స్‌ను తయారుచేసి ప్రైవేటు రంగంలో – ప్రధానంగా విదేశీ యాజమాన్యంలో వున్న మందుల సంస్థలకు అమ్ముతున్నది. ప్రైవేటురంగంలోని సంస్థలు ఈ మందులను బిళ్ళలుగా మార్చి ప్యాకింగ్‌చేసి 'ఉత్పత్తి' ఖర్చుకంటే 2000శాతం అధిక ధరకు మందులమ్మి ఇబ్బడిముబ్బడిగా లాభాలార్జించుకొంటున్న వైనాన్ని టి.ఎన్. వివరించారు. ఈ ప్రైవేటు కంపెనీలు చేస్తున్నదల్లా ఈ బల్క్ డ్రగ్స్‌ను బిళ్ళలుగా మార్చి ప్యాకింగ్ చేయడమే. ఈ ప్రైవేటు పెట్టుబడిదారుల, విదేశీ కంపెనీల లాభాల దాహాన్ని తీర్చడానికే ఐ.డి.పి.ఎల్. కార్మికుల శ్రమ ఉపయోగపడిందని టి.ఎన్. పేర్కొన్నారు. సరిగ్గా టి.ఎన్. పేర్కొన్నవిధంగానే ఐ.డి.పి.ఎల్. నష్టాల ఊబిలో కూరుకుపోయి ఐ.డి.పి.ఎల్.కి అంత్యక్రియలు జరిపి వేసింది. నేటి నెహ్రూ వారసులుగా వచ్చామని చెప్పుకొంటున్న ఈ ప్రభుత్వం ఐ.డి.పి.ఎల్. శవపేటికకు తొలిమేకులు వేసింది 1970లలోనే అని అర్థం అవుతుంది.

పైన పేర్కొన్నలాంటి అనేక ఉదాహరణలను కోర్టులో కా(మేడ్ టి.ఎన్. ఉటంకిస్తూ – ఒక్కమాటలో ఈ దేశపు పబ్లిక్ రంగం పబ్లిక్ రంగమేకాదని, ఇది ప్రైవేటురంగాన్ని మేపడానికి ఉద్దేశించిన అందమైన నినాదం అని చెప్తూ ఆయన ఈ నిర్ధారణ చేశారు : "అనేక ప్రభుత్వ సంస్థలలో ఈక్విటీ పెట్టుబడుల రూపంలోనూ, రుణ పెట్టుబడి రూపంలోనూ, ప్రత్యక్ష మేనేజిమెంట్ రూపంలోనూ లేక డైరెక్టర్ల బోర్డుల్లో భాగస్వామ్యాల రూపంలోనూ ప్రైవేటు రంగం జోక్యం ఉంటున్నది. మొత్తంగా ఉదహరించిన 8 సంస్థలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి 23.59 కోట్లుకాగా; ప్రైవేటురంగ కంపెనీలు, ప్రధానంగా విదేశీ గుత్తసంస్థలు వీటిలో 22.76 కోట్లు పెట్టుబడి పెట్టాయి. ఈవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ రంగం యొక్క అధిక లాభార్జనకు మంచి సాధనాలుగా తయారయ్యాయి. జాతీయ సంపదపై కంట్రోలులో, జాతీయాదాయం పంపిణీలో అసమానతలు పెరగడానికి పబ్లిక్ రంగం ఒక కారణమైంది".

సరిగ్గా టి.ఎన్. చెప్పినట్లే ఈనాడు సంక్షోభం మరింత తీవ్రమైంది. పబ్లిక్ రంగ సంస్థలలో దొంగదారిన అనేక రూపాల్లో ప్రవేశించిన విదేశీ గుత్త సంస్థల పెట్టుబడి, ఆయా పబ్లిక్ రంగ సంస్థలను మింగివేసింది. కొద్దో గొప్పో పోటీపడిన పబ్లిక్‌రంగ సంస్థల షేర్లను పూర్తిగా అతి కనిష్ట ధరలకు విక్రయించడం ద్వారా నేటి ప్రభుత్వాలు నెహ్రూ ప్రభుత్వం నిర్దేశించిన కర్తవ్యాలను పరిపూర్తి చేశాయి. ఒక క్రమం ప్రకారం పబ్లిక్‌రంగ సంస్థలను ప్రైవేట్ పెట్టుబడిదార్లకు అంకితం చేస్తూ వచ్చిన ఈ పాలకుల నాటకాలకు చరమఘట్టంగా మొత్తంగా కోట్లాది కార్మికుల స్వేదజలం ప్రవహించిన ఈ పరిశ్రమలు మూతపడటానికి తిరిగి ఆ కార్మికులనే కారణంగా చూపి ద్రోహులుగా బోనెక్కించి విదేశీ గుత్త సంస్థలకు పూర్తిగా పాదా క్రాంతం చేస్తున్న పరిస్థితులను వివరించిన తీరు ఆయనను అర్థశాస్త్ర విశ్లేషకుడిగా ఉన్నత స్థానంలో నిలబెడుతున్నది.

సామ్రాజ్యవాదం భారతదేశంలో బడా దళారీ బూర్జువా వర్గాలతో కుమ్మక్కై ఈ దేశపు పాలకవర్గాల మద్దతుతో ఈ దేశపు సంపదను అపారంగా తరలించుకు పోతున్న దృశ్యాన్ని నాగిరెడ్డి న్యాయస్థానాల్లో ఆవిష్కరించారు. అదే సమయంలో భారత బడా(దళారీ) బూర్జువావర్గం సాపేక్షికంగా బీదదేశాలలోకి తమ పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా స్వయంగా విస్తరణవాద కాంక్షలను ఎలా కలిగివుందో వివరించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఆగ్నేయాసియా నుండి మధ్య ప్రాచ్యంవరకూ ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల కేంద్రంగా భారత్ అభివృద్ధి చెందాలన్న ఈ దేశపు "సోషలిస్టు" ప్రధాని నెహ్రూ ఆకాంక్షలకు అనుగుణంగా భారత దళారీ బూర్జువా వర్గం తన పాత్రను పోషించడానికి తయారైందని కా॥ నాగిరెడ్డి కుండబద్దలు కొట్టినట్లు అత్యంత తేటతెల్లంగా నిరూపించాడు. ఆఫ్రికా ఖండంలోని ఇథియోపియా, ఘనా, కెన్యా, లిబియా, మారిషస్, నైజీరియా, కాంగో, ఉగాండా, జాంబియా దేశాలలోను; ఆసియా ఖండంలోని ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాలలోను; దక్షిణ అమెరికా ఖండంలో ఒకే ఒక దేశం కొలంబియాలోను భారత దళారీ బూర్జువా పెట్టుబడి వ్యాపించి వుందని, అక్కడ కార్మికుల రక్తమాంసాలను జుర్రుకోవడంలో ఈ దళారీ బూర్జువావర్గం అవిరళ కృషిలో మునిగి వుందని టి.ఎన్. నిరూపించారు.

మరోవైపు భారత దళారీ పాలకుల విస్తరణవాద, చొరబాటుదారీ విధానాలకు అనుకూలంగా ఈ బడా (దళారీ) బూర్జువావర్గం ఎంత అత్యుత్సాహంతో ప్రవర్తిస్తోందో టి.ఎన్. ఇలా విశదీకరించాడు. "తూర్పు బెంగాల్‌లోకి భారత సాయుధ దళాలు దురాక్రమణ

జరిపిన వెంటనే ప్రవాస ప్రభుత్వం ఇంకా ఢాకాకు చేరకముందే భారత బడా వ్యాపారుల రాజైన టాటా నాయకత్వంలో ఏడుగురితో కూడిన ఉన్నతస్థాయి బృందం తూర్పు బెంగాల్‌కి వెళ్ళడం ప్రపంచంలోని ప్రజాస్వామికవాదులను దిగ్భ్రాంతిపరిచింది". ఆయన ఇంకా ఇలా అన్నారు : "తూర్పు బెంగాల్‌లో కనీసం పూర్తి అధికారాలు కలిగిన ప్రభుత్వం ఏర్పడకమునుపే, ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే అవకాశాల గురించి పరిశీలించడానికి ఈ ప్రతినిధి వర్గానికి 'సోషలిస్టు' భారత ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కలుగచేసింది. తూర్పు బెంగాల్ ఎవరిది? తూర్పు బెంగాల్ ప్రజలదా? లేక టాటా తదితర భారతీయ గుత్తాధిపతులదా? భారత పాలకుల విస్తరణవాద రాజకీయ వాంఛలకు అనుకూలంగా ఈ దేశపు బడా(దళారీ) బూర్జువావర్గం, వీళ్ళకు అనుకూలంగా ఇక్కడి 'సోషలిస్టు' ప్రభుత్వం పోటీలు పడి దేశాలను ఫైనాన్స్ పెట్టుబడితో ఆక్రమించు కొంటున్న తీరు తిమింగల న్యాయాన్ని తలపిస్తోందని టి.ఎన్. నిష్కర్షగా కోర్టులో ప్రకటించారు.

భారత బడా దళారీ బూర్జువావర్గం – ఈ దేశపు దళారీ పాలకుల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో తన ఫైనాన్స్ పెట్టుబడిని ఎగుమతిచేస్తూ సంపదలను పోగుచేసు కొంటున్న దృశ్యం ఒకవైపున ఉండగా, ఇదే దళారీ బూర్జువా వర్గానికున్న మరో నీచమైన దృష్టిని సైతం కామ్రేడ్ టి.ఎన్. బహిర్గతపరచారు. ఇతర పేద దేశాలలో తన పెట్టుబడిని మాత్రమే పెట్టి లాభాలార్జించే అంశం మాత్రమేకాక, సామ్రాజ్యవాద దేశాల ఫైనాన్స్ పెట్టుబడికి వాహకనౌకలుగా సైతం ఈ దేశపు దళారీ బూర్జువావర్గం ఉపయోగపడుతున్నది. దీన్ని టి.ఎన్. ఇలా చెప్పారు : "తనకు భృత్యువైన భారత బూర్జువావర్గంతో మిలాఖతై భారతదేశంలో తిష్టవేసుకుని కూర్చున్న విదేశీ పెట్టుబడిదారులు ఇప్పుడు ఆసియా, ఆఫ్రికా దేశాలలో మిలాఖత్ పరిశ్రమలను స్థాపించడానికి భారత బూర్జువా వర్గాన్ని అడ్డం పెట్టుకొని తెరమరుగు ప్రయత్నాలు చేశారు". టి.ఎన్. చెప్పినట్లుగానే ఈ తెరమరుగు ప్రయత్నాలకు భారత బడా దళారీ బూర్జువావర్గం, ఈ దేశపు దళారీ పాలకవర్గం బ్రహ్మాండమైన మద్దతు పలికారు. విదేశీ పెట్టుబడి, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం, భారతదేశపు చౌకయిన శ్రమశక్తి ఒక్కుమ్మడిగా లాభాలు ఆర్జిస్తూ సామ్రాజ్యవాద పెట్టుబడికి అర్పిస్తుంది. ఈ మొత్తం పరిస్థితిని కామ్రేడ్ టి.ఎన్. ఉదాహరణలతో సైతం తన ప్రసిద్ధ స్టేట్‌మెంట్‌లో వివరించారు. ఈ విధంగా కామ్రేడ్ టి.ఎన్. భారత దళారీ పాలకులు నెహ్రూ కాలం నుంచి అనుసరిస్తూ వచ్చిన విస్తరణవాద విధానాలను, భారత దళారీ బూర్జువావర్గపు నీతిమాలిన దోపిడీ గురించి – సామ్రాజ్యవాద ఫైనాన్స్ పెట్టుబడిని చేరవేసే దళారులుగా ప్రకాశిస్తున్న ఈ బూర్జువావర్గం యొక్క నీచమైన పాత్రను, ఈ నీచమైన పాత్రలో దళారీతనపు ఈ దివాళాకోరు 'సోషలిస్టు' పాలకులు సోషల్ సామ్రాజ్యవాద, సామ్రాజ్యవాద శక్తులకు ఊడిగం చేస్తున్న తీరును ఎండగట్టారు. భారత పాలకుల ముసుగులు చించివేసి మేక వన్నె పులి స్వభావాన్ని చీల్చిచెండాడి విశాల పీడిత ప్రజానీకంలో తిరుగులేని నాయకునిగా కీర్తి ప్రతిష్టలు ఆర్జించిన కా॥ టి.ఎన్. 'దేశద్రోహి'గా కాక ఇంకెలా పిలువబడతాడని మనం ఆశించగలం! తదుపరి కాలంలో శ్రీలంకలోనూ, దక్షిణాఫ్రికా విముక్తి పోరాటాన్ని సమర్ధించే పేరుతో ఈ దేశపు దళారీ బూర్జువాల, సామ్రాజ్యవాదుల పై ఉమ్మడి కంపెనీల ప్రవాహం గురించి మనకు టి.ఎన్. చెప్పిన విషయాలు అక్షరసత్యాలుగా నిరూపితమయ్యాయి. ఈ నిరూపణ ఒక సజీవ దృశ్యంగా ఆవిష్కరించబడుతోంది. ఈవిధంగా భారత దళారీ బూర్జువావర్గం, ఈ దేశపు విద్రోహకర పాలకులు కేవలం ఈ దేశంలో పీడిత ప్రజానీకం మూల్గులు పీల్చి వాళ్ళను అర్ధబానిసలుగా చేసే కర్తవ్యాన్నేకాక అంతర్జాతీయంగా కూడా వీళ్ళ కూటమి సామ్రాజ్యవాదుల మోచేతి నీళ్ళు తాగుతూ అంతర్జాతీయ కార్మికవర్గానికి, పీడిత ప్రజానీకానికి విద్రోహం చేస్తున్నారని టి.ఎన్. విశ్లేషించారు.

కా॥ టి.ఎన్. భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవాన్ని నిర్వహించే కర్తవ్యం కార్మిక వర్గానిదే అని, ఈ కర్తవ్యం కార్మికవర్గం భుజస్కంధాలపై ఎందుకుందో అని చెప్పినందుకే తమను కుట్రదారులుగానూ, దేశ ద్రోహులుగానూ ఈ పాలకవర్గాలు చిత్రీకరిస్తున్నాయనే భారత బూర్జువావర్గపు స్వభావాన్ని సునిశితంగా విశ్లేషిస్తూ చెప్పారు. భారత బూర్జువావర్గం విప్లవ పూర్వపు చైనా బూర్జువావర్గం కన్నా సాపేక్షికంగా బలమైనదే అయినా ఈ బూర్జువావర్గపు దళారీ స్వభావంలో మాత్రం ఎటువంటి మెరుగుదలా లేదని ఆయన నిరూపించారు. భారత బూర్జువాల ఆస్తులలో అభివృద్ధిని చూపించి ఇది జాతీయ బూర్జువావర్గ లక్షణాలను కలిగివుందని, ఇది సామ్రాజ్యవాదంతో పోరాడే చేవ కల్గి వుందని నయా రివిజనిజం చేస్తున్న వాదనలలో బూటకత్వాన్ని టి.ఎన్. వెల్లడించారు. భారత బూర్జువావర్గం ఫ్యూడలిజాన్ని కూలద్రోసే పోరాటాలకు కాక – తన కంపెనీలలో పెద్ద పెద్ద భాగస్వామ్యాలకు ఈ దేశపు ఫ్యూడల్ శక్తులకు, సామ్రాజ్యవాదులకు ఏకకాలంలో అనుమతినీయడం ద్వారానూ, ఈ రెండు ప్రతీఘాత శక్తులతో అత్యంత నీచంగా పీటముడి వేసుకోవడం ద్వారా ఈ బూర్జువా వర్గం తన కర్తవ్యమైన ఫ్యూడల్ వ్యతిరేక, ప్రజాతంత్ర విప్లవాన్ని సాధించే పనిని పూర్తిగా వదులుకొంది. అంతేకాక వీళ్ళ ఆస్థులలో గణనీయమైన పెరుగుదల కేవలం సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాల ద్వారా సంపాదించినదే తప్ప ఇవి స్వతంత్రంగా అభివృద్ధి అయినవి ఏమాత్రం కాదు. ఈ బూర్జువావర్గం సామ్రాజ్యవాద, ఫ్యూడల్ శక్తులతో మొదలంటా పెన వేసుకుపోయి ఈ దేశపు కార్మికవర్గానికి విద్రోహం చేసింది. కామ్రేడ్ టి.ఎన్. ఈ బడా కంపెనీల ఆస్థుల పెరుగుదలలోని మర్మాన్ని బట్టబయలుచేస్తూ ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతం చేయాల్సిన కర్తవ్యం కార్మిక వర్గంపైనే వుందని ఉద్ఘోషించాడు. ఇలా ఉద్ఘోషించిన నేరానికి తమను కుట్రదారులని పేర్కొన్నారని విస్పష్టంగా ప్రకటించారు. ఈ మొత్తం బీభత్స రసపూరిత నాటకంలో ప్రధాన పాత్రధారులుగా ఈ దేశపు బడా దళారీ బూర్జువా వర్గం, వాళ్ళు కుమ్మక్కు అయిన సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజాలే ఉన్నాయని; వీళ్ళను కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా సమసమాజ వ్యవస్థను నెలకొల్పాలన్నది 'కుట్రే' గనుక అయితే, ఆ ఆశయాన్ని సాధించడానికి, ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో తమకెట్టి సందేహమూలేదని, వెనకబడిపోమనీ కోర్టులో కామ్రేడ్ టి.ఎన్. స్పష్టంగా ప్రకటించాడు.

OOOO